క్లుప్తంగా

నూకాలమ్మ అమ్మవారి హుండీల లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

బోట్‌క్లబ్: పెద్ద మార్కెట్‌లోని నూకాలమ్మ అమ్మవారి హుండీలను శనివారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. 45 రోజులకు రూ.3.06 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ సత్యవాణి తెలిపారు. ఈ హుండీల లెక్కింపులో దేవాదాయ, ధర్మాదాయ శాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్, బంగారు చినశోభనాది సత్రం ఈఓ అడబాల శ్రీనివాస్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంబులెన్స్‌కు ఆర్థిక సాయం

కరప: అభినయ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఉచిత అంబులెన్స్ సర్వీసుకు విశ్రాంత చీఫ్ లేబర్ కమిషనర్(కాకినాడ) రూ.పది వేల ఆర్థిక సాయం అందించారు. అంబులెన్స్ టైర్లు బాగా లేకపోవడంతో సేవా కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడింది. ఈ విషయాన్ని కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు రిటైర్డు లేబర్ కమిషనర్ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి అంబులెన్స్‌కు కొత్త టైరు కొనుగోలుకు ఆర్థికసాయం అందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మట్టపర్తి శ్రీధర్‌సిద్ధు, మాజీ సర్పంచ్ తాతీలు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలించిన ఆర్‌ఓ



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఓ వెంకటరావు

కాకినాడ: కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు శనివారం ఈవీఎం, వీవీ ప్యాట్లను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించారు. మెక్లారిన్ గ్రౌండ్స్‌లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో ఏర్పాటు చేసిన ఈ తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. అక్కడి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఏఆర్‌ఓ చల్లన్నదొర, ఇతర అధికారులు ఉన్నారు.

కార్యకర్త భౌతికకాయానికి కన్నబాబు నివాళి



శ్రీను భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: రోడ్డు ప్రమాదంలో మరణించిన పెదకొత్తూరుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కోన శ్రీను భౌతికకాయానికి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నివాళులర్పించారు. స్థానిక నాయకులతో కలిసి శనివారం పెదకొత్తూరు గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోన శ్రీను మృతిచెందారు. పెదకొత్తూరు వెళ్లిన కన్నబాబు.. శ్రీను భౌతికకాయానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతా బుజ్జి, మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

దివ్యాంగునికి ఆర్థిక సాయం



చెక్కు అందిస్తున్న నరసింహమూర్తి

కాకినాడ రూరల్: రమణయ్యపేట కాల్వ గట్టుకు చెందిన దివ్యాంగుడి గృహ నిర్మాణం కోసం గైగోలుపాడు మూర్తి స్కూల్ అధినేత, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పాలిక నరసింహమూర్తి రూ.30 వేల ఆర్థిక సాయం అందించారు. సిమెంట్ కోసం ఈ ఆర్థిక సహకారం చెక్కును దివ్యాంగుడు నురుకుర్తి రమేష్‌కు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ తనవంతుగా రమేష్‌కు ఇంటి నిర్మాణం కోసం సాయం చేశానని, అతడి నలుగురు పిల్లల్లో ఇద్దరికి ఉచితంగా తమ పాఠశాలలో విద్యను అందిస్తున్నట్టు తెలిపారు.

జి.భావారంలో ఎన్నికల ప్రచారం

కరప: మండలంలోని జి.భావారంలో శనివారం జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జనసేన కాకినాడ రూరల్ అసెంబ్లీ అభ్యర్థి పంతం నానాజీ, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు.

దాహం తీర్చేందుకు..

- వేసవి తాపం నుంచి ఉపశమనానికి చలివేంద్రాల ఏర్పాటు
- నగరపాలక సంస్థ ఆధ్వర్యాన కాకినాడలో నేటి నుంచి 16 ప్రాంతాల్లో ప్రారంభం



కాకినాడలో సిద్ధమవుతున్న చలివేంద్రం

కాకినాడ: వేసవి తాపం నుంచి ప్రజలకు కొంత ఉపశమనాన్ని కలిగించేందుకు కాకినాడ నగరంలోని పలు ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ నిర్ణయించింది. ప్రతి ఏటా ఏర్పాటు చేస్తున్న రీతిలోనే ఈ ఏడాది కూడా దాదాపు 16 ప్రాంతాల్లో వీటిని నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశాల మేరకు ఆదివారం నుంచి ఆయా ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసే దిశగా ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్ విభాగాలు నడుం బిగించాయి. ఎండల తీవ్రత విపరీతంగా పెరిగిన నేపథ్యంలో వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు కొంత వరకైనా ఊరటనిచ్చే లక్ష్యంతో ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా ప్రతిపాదన చేశారు. జన సాంద్రత అధికంగా ఉండే ప్రాంతాలను గుర్తించి, అక్కడ చల్లని మంచినీటిని అందివ్వాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు.

తొలుత ఏడు ప్రాంతాల్లో..

నగరపాలక సంస్థ పర్యవేక్షణలో ఏర్పాటయ్యే చలివేంద్రాలను తొలుత ఏడు చోట్ల ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్, భానుగుడి, జీజీహెచ్, అన్నమఘాటీ సెంటర్, కోటిపల్లి బస్టాండ్, బాలాజీచెరువు వంటి ప్రాంతాలను తొలి విడతగా ఎంపిక చేశారు. ఆ తర్వాత రెండో విడతలో రాజా ట్యాంక్ పార్కు, గాంధీ పార్కు, కరణంగారి జంక్షన్, మున్సిపల్ కార్యాలయం, డెయిరీ ఫారం వంటి ప్రాంతాలను ఎంపిక చేస్తున్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

ప్రస్తుత వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు మంచి నీటి కోసం ఇబ్బందులు పడకుండా వేసవి కార్యాచరణను కూడా ఇప్పటికే సిద్ధం చేశారు. కార్పొరేషన్ వద్ద ఉన్న ఆరు నీళ్ల ట్యాంకర్లతో పాటు, మే ఒకటో తేదీ నుంచి మరో మూడు అద్దె ట్యాంకర్లను కూడా సిద్ధం చేస్తున్నారు. వీటితో పాటు వేసవి జలాశయాల వద్ద బండ్లను అభివృద్ధి చేయడం, జనరేటర్ల ఏర్పాటు వంటి ఇతర ఏర్పాట్లపై కూడా నగర పాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది.

చల్లని నీటిని అందిస్తాం



వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. నగరం మొత్తం మీద 16 చోట్ల ఏర్పాటు చేసేందుకు వీలుగా అవసరమైన అన్ని చర్యలూ తీసుకున్నాం. ప్రధానంగా వేసవి గాడ్పులు అధికంగా ఉన్నందున, అన్నిచోట్లా చల్లని నీటిని అందించనున్నాం. ఆరంభంలో ఏడు చోట్ల, మలివిడత మిగిలిన ప్రాంతాల్లోను చలివేంద్రాలను సిద్ధం చేస్తున్నాం.

– పి.సత్యకుమారి, సూపరింటెండెంట్ ఇంజినీర్, కాకినాడ

హైస్కూల్‌కు సోలార్ సిస్టం వితరణ



బ్రాంచ్ మేనేజర్‌ను సత్కరిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కరప: వేములవాడ జెడ్పీ ఉన్నత పాఠశాలకు స్థానిక కెనరా బ్యాంక్ కాకినాడ కాన్ఫిన్ హోమ్స్ లిమిటెడ్ వితరణతో రూ.5.53 లక్షల విలువైన 3 కేవీ ఆన్‌గ్రిడ్ సోలార్ పవర్ సిస్టం, 50 రీడింగ్ చైర్లను సమకూర్చారు. బ్యాంక్ కాకినాడ బ్రాంచ్ మేనేజర్ బీఎస్‌కే రమేష్, ఆఫీసర్లు రమణ, అనిల్ తదితరులు శనివారం హైస్కూలుకు వెళ్లి హెచ్‌ఎం శ్రీనివాస్‌కు వీటిని అందజేశారు.

ఎయిర్ కూలర్ బహూకరణ

బోట్‌క్లబ్: హరీష్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్ శనివారం స్థానిక జగన్నాథపురంలోని రెయిన్‌బో చిల్డ్రన్ హోమ్‌కు ఎయిర్ కూలర్ బహూకరించారు. ప్రస్తుత వేసవిలో చిన్నారులు వేసవి తాపానికి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారికి కూలర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కాకినాడ జేడబ్ల్యూఏ అధ్యక్షుడు మంగా శివరామకృష్ణ, మత్స్యకార నాయకుడు బడే కృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

ఎమ్మెల్యే ద్వారంపూడి సమక్షంలో చేరిన టీడీపీ, జనసేన శ్రేణులు

కాకినాడ: కాకినాడ జె.రామారావుపేట 21వ డివిజన్‌కు చెందిన పలువురు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు శనివారం పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్ ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన ఎస్‌కే ఆలీషా, జనసేనకు చెందిన ఖాదర్ షరీఫ్ సహా దాదాపు 60 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. అలాగే మాజీ కార్పొరేటర్ బొర్రా రమణ ఆధ్వర్యంలో మోటారు యూనియన్‌కు చెందిన మట్టా దుర్గారావు, మట్టా సతీష్‌తో పాటు, 15 కుటుంబాలకు చెందిన మహిళలు, యువకులు పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి వీరందరినీ పార్టీలోకి ఆహ్వానించి, మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా కష్టించి పనిచేయాలని సూచించారు. తనతో పాటు, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, గెలిపించేలా కృషి చేయాలన్నారు.

మత్స్యకారులకు పరిహారం అందేలా కృషి

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా స్పష్టమైన హామీ ఇచ్చారు
- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ద్వారంపూడి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: చమురు నిక్షేపాల కారణంగా నష్టపోతున్న మత్స్యకారులకు ఓఎన్‌జీసీ సంస్థ నుంచి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన స్థానిక 21వ డివిజన్‌లో జె.రామారావుపేట ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మేమంతా సిద్ధం సభలో పాల్గొనేందుకు కాకినాడ వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారుల సమస్యలపై అశేష జనవాహిని ఎదుట తన వైఖరిని స్పష్టం చేశారన్నారు. కాకినాడలో తాము చేసిన పోరాటం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ కారణంగా కాకినాడ ప్రాంత మత్స్యకారులకు సిస్మిక్ సర్వే కారణంగా కలిగే నష్టాన్ని భర్తీ చేసేందుకు ఇప్పటికే నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన వెంటనే ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, మత్స్యకారులందరికీ పరిహారం అందించేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో మత్స్యకారులు వైఎస్సార్ సీపీని ఆదరించి విజయాన్ని అందించాలని కోరారు. వీరి ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. 21వ డివిజన్‌లో ప్రజల అవసరాల మేరకు కమ్యూనిటీ హాళ్లు, ఆలయాలు, రోడ్లు, డ్రైనేజీలు సహా సకల మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ బొర్రా రమణ, వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సతీమణి ప్రచారం

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సతీమణి మహాలక్ష్మి శనివారం 47వ డివిజన్ కరణంగారి జంక్షన్ ప్రాంతంలో విస్తృత ప్రచారం చేశారు. గడచిన ఐదేళ్లలో భర్త ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయనకు ఘన విజయాన్ని అందించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ద్వారంపూడిని గెలిపిస్తే కాకినాడ నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తారన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ కార్పొరేటర్ నల్లబెల్లి సుజాత, రాజారపు కృష్ణ, మీసాల రామ సునీత తదితరులు ఆమె వెంట ఉన్నారు.

కుమార్తెల ప్రచారం

ఎమ్మెల్యే ద్వారంపూడి కుమార్తెలు డాక్టర్ ప్రణీత, డాక్టర్ అంజని తండ్రికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. 16వ డివిజన్ డాల్ఫిన్ స్కూల్ నుంచి డాక్టర్ అంజని ప్రచారం చేపట్టి ఇంటింటికీ వెళ్లి తండ్రి ద్వారంపూడికి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచారానికి వెళ్లిన ఆమెను స్థానికులు పూలమాలలతో స్వాగతించారు. కాగా 27వ డివిజన్ దూదిమిల్లు ప్రాంతంలో ద్వారంపూడి మరో కుమార్తె డాక్టర్ ప్రణీత ఎన్నికల ప్రచారానికి వెళ్లగా, స్థానికులు బ్రహ్మరథం పట్టారు. నిరంతరం ప్రజాసేవకు అంకితమైన తండ్రి ద్వారంపూడిని మరోసారి ఆదరించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, రాజాన ప్రకాష్, వరిపల్లి కృష్ణవేణి, వరిపల్లి శివ, మన్యం బాబి పాల్గొన్నారు.



తండ్రి ద్వారంపూడికి మద్దతుగా ప్రచారం చేస్తున్న కుమార్తె డాక్టర్ ప్రణీత



భర్త ద్వారంపూడికి ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్న సతీమణి మహాలక్ష్మి



సంక్షేమ పథకాలను వివరిస్తూ, తండ్రి కోసం ఓట్లు అభ్యర్థిస్తున్న కుమార్తె డాక్టర్ అంజని

రాష్ట్ర రగ్బీ జట్టుకు గురజనాపల్లి బాలికలు



క్రీడాకారిణులతో హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయులు

కరప: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రగ్బీ బాలికల జట్టుకు కరప మండలం గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎర్రా జ్యోతిచంద్రిక, పలివెల సునంద తేజశ్రీ ఎంపికయ్యారు. మహారాష్ట్ర పుణెలోని ఛత్రపతి శివాజీ స్టేడియంలో ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే 67వ స్కూల్ గేమ్స్ అఖిల భారత రగ్బీ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ఆడతారని హెచ్‌ఎం ఎ.సాయిమోహన్ శనివారం తెలిపారు. గతేడాది నవంబర్ 20 నుంచి మూడు రోజులు జరిగిన 67వ రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా జట్టు తరఫున పాల్గొన్న జ్యోతిచంద్రిక, సునంద తేజశ్రీ ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లా జట్టును ద్వితీయ స్థానంలో నిలిపి, రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. పుణె వెళ్లేందుకు శనివారం వీరు బయలుదేరారు. వీరితో పాటు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.నాగలింగేశ్వరరావు, జి.అర్జునరావును హెచ్‌ఎం సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, వీవీ రమణమూర్తి, ఎస్‌ఎంసీ చైర్మన్ పబ్బినీడి వీరబాబు అభినందించారు.

ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత



ఓటు ప్రాధాన్యాన్ని వివరిస్తున్న అధికారులు

కాకినాడ సిటీ: ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ముఖ్యంగా యువకులు బాధ్యతాయుతంగా ఓటు వేసి, చిత్తశుద్ధి కలిగిన అభ్యర్థులను ఎన్నుకోవాలని రాష్ట్ర ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) అదనపు డైరెక్టర్ జనరల్ రాజేందర్ చౌదరి అన్నారు. స్థానిక ఐడియల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్‌లో శనివారం నిర్వహించిన ఓటరు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ భవిష్యత్తును నిర్దేశించడానికి యువత రానున్న ఎన్నికల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) జిల్లా నోడల్ అధికారి విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ, ఓటింగ్ ప్రక్రియ ద్వారా నాయకులను ఎంపిక చేయడంలో పౌరుల పాత్రను వివరించారు. సీబీసీ కాకినాడ ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి శ్రీరామమూర్తి కూడా ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. ఓటు హక్కుపై అవగాహన పెంచేలా సంగీత ప్రదర్శనలు నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఓ వెంకటరావు

బోట్‌క్లబ్: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకుని, ప్రజాస్వామ్యంలో మంచి పరిపాలన అందించే పార్టీ వారిని గెలిపించుకోవాలని కాకినాడ సిటీ ఆర్‌ఓ, కాకినాడ నగర కమిషనర్ వెంకటరావు అన్నారు. స్థానిక రోటరీ హాల్లో రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడు నరహరిశెట్టి రవికృష్ణ అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. ప్రజలంతా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. ఓటింగ్ కేంద్రాలకు తీసుకువెళ్లేందుకు ఆటోలను, పోలింగ్ బూత్‌ల వద్ద టెంట్లు, మంచి నీరు, వికలాంగులకు వీల్ చైర్లను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ చందు, సభ్యులు అచ్యుతరామారెడ్డి, నల్లమిల్లి మాచారెడ్డి, భూపేంద్ర, నేతి నాగేశ్వరరావు బదిరెడ్డి వెంకన్న, చేయుత రవి పాల్గొన్నారు.

శృంగార వల్లభుడి ఆలయానికి భక్తుల రద్దీ

- రూ.2.57 లక్షల ఆదాయం



శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.2,57,388 ఆదాయం సమకూరినట్టు ఈఓ తెలిపారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రసాద వితరణ, అన్నదానంతో పాటు, మజ్జిగ చలివేంద్రాన్నీ ఏర్పాటు చేసినట్టు ఈఓ తెలిపారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, ఆలయ అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పెద్దింటి పురుషోత్తమాచార్యులు పాల్గొన్నారు.

22న ద్వారంపూడి నామినేషన్



ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఈ నెల 22వ తేదీ సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆనందభారతి గ్రౌండ్స్ నుంచి ఫ్లై ఓవర్ మీదుగా భానుగుడి, మిలటరీరోడ్, శారదాదేవి ఆలయం మీదుగా భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 10.49 గంటలకు కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుని సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావుకు తన నామినేషన్ పత్రాలను అందజేయనున్నారు. ఈ మేరకు పార్టీ వర్గాలు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాల్సిందిగా పార్టీ నేతలు పిలుపునిచ్చారు.

మూడో రోజు నామినేషన్లు నిల్

కాకినాడ: కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గానికి మూడో రోజైన శనివారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. తొలిరోజు ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేయగా, రెండో రోజు టీడీపీ అభ్యర్థి వనమాడి వెంకటేశ్వరరావు మాత్రమే నామినేషన్ వేశారు. మూడో రోజైన శనివారం ఒక్కరు కూడా నామినేషన్ దాఖలు చేయలేదు.

స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ దాఖలు

కాకినాడ రూరల్: కాకినాడ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీకి శనివారం స్వతంత్ర అభ్యర్థి చాగంటి సూర్యనారాయణ మూర్తి నామినేషన్ దాఖలు చేశారు. మూడు రోజుల్లో ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేయగా, జనసేన అభ్యర్థి పంతం నానాజీ మరో రెండు నామినేషన్ సెట్లను ఆర్‌ఓ కిశోర్‌కు అందించారు.

ఐ-బ్యాంక్ చైర్మన్‌గా విజయలక్ష్మి



దామెర విజయలక్ష్మి



బాదం బాలకృష్ణ

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): బాదం బాలకృష్ణ ఐ-బ్యాంక్ చైర్మన్‌గా డాక్టర్ దామెర విజయలక్ష్మి బాధ్యతలు చేపట్టారు. ఆమెతో పాటు కార్యదర్శిగా డాక్టర్ బాదం బాలకృష్ణ, కోశాధికారిగా దాసరి సాయికృష్ణ కూడా ఎన్నికయ్యారు. శనివారం కాకినాడలో సంస్థ నూతన కార్యవర్గ ఎన్నికను ఐ-బ్యాంక్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఐ-బ్యాంక్‌ను మరింత అభివృద్ధి చేసి, కాకినాడ, పరిసర జిల్లాలను కార్నియల్ అంధత్వ రహిత జిల్లాలుగా మార్చడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యదర్శి బాదం బాలకృష్ణ మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఐ-బ్యాంక్ ద్వారా 6,900కి పైగా కార్నియాలు సేకరించి, కార్నియల్ అంధులకు అమర్చామన్నారు. నేత్రదానంపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టబోతున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మురళీకృష్ణ, ట్రస్టీలు చెలికాని వెంకటసూర్యారావు, రావుల శ్రీరామ్, పైడా సోమేశ్వరరావు, కృష్ణారెడ్డి, జీవీఎస్ గాంధీజీ పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- వేళంగిలో సినీ దర్శకుడు కల్యాణకృష్ణ ప్రచారం



వేళంగిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సినీ దర్శకుడు కురసాల కల్యాణకృష్ణ

కరప: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, వచ్చే ఎన్నికల్లో మరోసారి గెలిపించి ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, సినీ దర్శకుడు కురసాల కల్యాణకృష్ణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి మండలంలోని వేళంగి గ్రామంలో పర్యటించి, స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాకినాడ రూరల్‌లో మరింతగా అభివృద్ధి జరగాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండుసార్లు బటన్ నొక్కి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించి, తద్వారా జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఓటర్లను కోరారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకి శ్రీలక్ష్మి, సర్పంచ్ సాదే నీలిమ, గ్రామ కమిటీ అధ్యక్షుడు జీలకర్ర దుర్గారావు, మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, ఎంపీటీసీలు కొప్పిశెట్టి మంగయ్యమ్మ, ముషిని సూరిబాబు, నాయకులు సవిలే రాజేష్, జల్దాని రాంబాబు, సానా శ్రీను, కె.గుణ, కొండ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కరప: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కరప ఎస్సై టి.రామకృష్ణ శనివారం తెలిపారు. వాకాడ గ్రామానికి చెందిన దూడల రత్నరాజుకు, కడియం మండలం వేమగిరి గ్రామానికి చెందిన పెన్నాడ దివ్య వెంకటదుర్గ వరలక్ష్మి అభితతో ఆరు నెలల క్రితం వివాహమైంది. ఈ నెల 14వ తేదీన రత్నరాజు తన తల్లితో కలిసి ఓ ఫంక్షన్‌కు హాజరయ్యాడు. ఇంటికి తిరిగొచ్చి చూసేసరికి అభిత కనిపించలేదు. అప్పటి నుంచి పరిసర గ్రామాల్లోను, బంధుమిత్రుల వద్ద గాలించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం రాత్రి అభిత భర్త, అత్త కలిసి కరప పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.